మంగళ వారం
28-11-2023
సంపుటి - 08,
సంచిక - 399
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## కాంగ్రెస్ అంటే కరెంట్ కట్

### ఆలోచించి జాగ్రత్తగా ఓటేయాలి





- ధరణిని తీసి మళ్లీ పట్వారీ వ్యవస్థ తెస్తారు
- సంగారెడ్డికి బ్రహ్మాండమైన భవిష్యత్
- మెట్రో వస్తే దశ పూర్తిగా మారుతుంది
- పనిచేసే ఎమ్మెల్యే ఉంటేనే అభివృద్ధి సాధ్యం
- సంగారెడ్డి సభలో సిఎం కెసిఆర్ ఉద్ఘాటన
- మూడు గంటలు మాత్రమే ఇస్తారు
- ఆందోల్‌లో దళితబంధుతో ఆదుకుంటాం
- ఆందోల్ సభలో సిఎం కెసిఆర్ వెల్లడి
- ఐదేళ్ల భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు ఇవి
- దళితబంధును అడ్డుకున్న కాంగ్రెస్ దరిద్రులు
- వారు చేయని లాలూచి పనులు లేవు
- అసైన్డ్ భూములకు పట్టాలు ఇప్పించే బాధ్యత నాదే
- షాద్‌నగర్ ప్రజాశీర్వాద సభలో సిఎం కెసిఆర్

**సంగారెడ్డి, నవంబర్ 27 (సమ సమాజం):** సంగారెడ్డి వరకు మెట్రో రైలు వస్తే మీ దశనే మారిపోతదని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. సంగారెడ్డికి బ్రహ్మాండమైన భవిష్యత్ ఉంటుందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. సంగారెడ్డి పట్టణం హైదరాబాద్‌లో అంతర్భాగం అయితా ఉన్నది. మెట్రో రావాల్సిన అవసరం ఉంటది. ఇస్నాపూర్ వరకు మొదటి దశలో, రెండో దశలో సంగారెడ్డి వరకు తీసుకురావాలని చింతా ప్రభాకర్ చెప్పారు. సంగారెడ్డికి మెట్రో వచ్చిదంటే మీ దశనే మారిపోతది. లాస్ట్ టైం బీఆర్ఎస్ క్యాండిడేట్‌ను ఓడగొట్టినా.. సంగారెడ్డి మీద నేను అలగలేదు. సంగారెడ్డికి మెడికల్ కాలేజీ తెచ్చిపెట్టాను. చింతా ప్రభాకర్ నా వెంబడి పడి ఇక్కడకు మెడికల్ కాలేజీ వచ్చేలా చేశారు. దాంతో పాటు నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు వస్తున్నాయి. సంగారెడ్డికి బ్రహ్మాండమైన భవిష్యత్ ఉంటది అని కేసీఆర్ పేర్కొన్నారు. ఇక్కడ మంచిగా పని చేసే ఎమ్మెల్యే ఉంటే, హైదరాబాద్ సంకలోకి వచ్చింది సంగారెడ్డి కాబట్టి కాలుష్య రహితమైన పరిశ్రమలు, విద్యాసంస్థలు వచ్చే అవకాశం ఉంటది. ఇప్పటికే కొన్ని వచ్చాయి. ఇంకా బ్రహ్మాండంగా వస్తాయి. ఒకప్పుడు హైదరాబాద్‌లో ఉండి ఇక్కడకు వచ్చిపోయేది ఉద్యోగులు. ఇప్పుడు సంగారెడ్డిలో ఉండి హైదరాబాద్‌కు పోయి వస్తున్నరు. ఆ మార్పు వచ్చింది. సంగారెడ్డి బాగా పెరిగింది కాబట్టి ఆ మార్పు వచ్చింది. నేను పాత మెదక్ జిల్లా మీ బిడ్డను. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అని పెద్దలు చెప్పారు. జన్మభూమి మీద ఎవరికైనా సరే, ఎక్కడున్న ప్రేమ ఉంటది. అందుకే సంగారెడ్డితో నాకు అనుబంధం ఉంది. ఈసారి దయచేసి మళ్ల నేను అలిగేటట్టు చేయకండి ప్రభాకర్‌ను గెలిపించండి లాభం జరుగుతది అని కేసీఆర్ చెప్పారు. ఇండియా మొత్తంలో అత్యధిక శాలరీలు పొందుతున్నది తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగస్తులేనని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. మొన్ననే పీఆర్సీ అపాయింట్ చేశాం. మళ్ల మంచి పీఆర్సీ ఇచ్చుకుందాం.. డీఏలు కూడా బ్రహ్మాండంగా ఇచ్చుకుందామని కేసీఆర్ తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.ఈ రాష్ట్రంలో పేదలను, రైతులను, ప్రభుత్వ ఉద్యోగలను అందర్నీ సమదృష్టితో చూస్తున్నాం. తెలంగాణ ఉద్యమంలో నేను చెప్పాను ప్రభుత్వ ఉద్యోగస్తులకు, తెలంగాణ ధనిక రాష్ట్రం అయితది కాబట్టి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగా మీకు శాలరీలు వస్తాయని చెప్పాను. నేను రుజువు చేసి చూపెట్టాను. ఇవాళ సెంట్రల్ గవర్నమెంట్ కంటే ఎక్కువ జీతాలు వస్తున్నాయి. ఇండియా మొత్తంలో ఉద్యోగస్తులకు హైయేస్ట్ శాలరీ ఇచ్చేది ఏదన్న ఉందంటే అది తెలంగాణ స్టేట్ మాత్రమే. మళ్ల

3వ పేజీలో...

## తొమ్మిదేళ్లలో దగాపడ్డ తెలంగాణ

### ప్రజలు ఆలోచించి ఓటేయాలి




ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం ● భువనగిరి రోడ్‌షోలో కాంగ్రెస్ నేత ప్రియాంక

**యాదాద్రి భువనగిరి, నవంబర్ 27 (సమ సమాజం):** బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రజలకు ఏం చేసిందనే విషయాన్ని పదిసార్లు ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ అన్నారు. ఇచ్చిన తెలంగాణలో బాగుపడ్డది కేవలం కెసిఆర్ కుటుంబం మాత్రమేనని అన్నారు. అవినీతిలో కూరుకుపోయిన ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో చాలా కష్టాలు ఉన్నాయని ఇక్కడున్న చిన్న దుకాణాలు, రైతులు, విద్యార్థులు, చిన్న చిన్న పనులు చేసుకునేవారు ఎంతో కష్టపడుతున్నారని ఈ విషయం తనకు తెలుసునని ఆమె అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆమె భువనగిరిలో రోడ్ షోలో మాట్లాడుతూ... మీ దైనందిన జీవితంలో ప్రతి రోజూ పడుతున్న కష్టాల్లో .. ప్రభుత్వం నుంచి ఏం ఆశిస్తున్నారో అవి మీకు వస్తున్నాయా? అని అడిగారు. ఈ సర్కర్‌పై అటువంటి ఆశ ఉందా?.. ప్రజల సమస్యలపట్ల ప్రభుత్వానికి అవగాణ లేదని ఆమె విమర్శించారు. నోట్ల రద్దు సమయంలో ఏటీఎం, బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకునే విషయంలో ప్రజలు చాలా కష్టపడ్డారని, తర్వాత కరోనా వచ్చి ఎన్నో ఇబ్బందులు వచ్చాయని ప్రియాంక గాంధీ అన్నారు. కానీ ఈ ప్రభుత్వం ప్రజల కష్టాల్లో అండగా నిలబడలేదని ఆమె తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణలో యువతకు ఉద్యోగాలు కావాలనే ఆశ ఉందా? మీ కల నెరవేరాలంటే కాంగ్రెస్‌కు ఓట్లు గెలిపించాలని

3వ పేజీలో...

## తెలంగాణలో బిజెపి ప్రచారహోరు

### నగరంలో ప్రధాని మోడీ రోడ్ షో




- సుడిగాలి పర్యటనలతో ప్రధాని మోడీ ప్రచారం
- తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడడం ఖాయం
- తొలి బిసి ముఖ్యమంత్రిని నియమిస్తామని ప్రకటన
- అంధ విశ్వాసాల ముఖ్యమంత్రి అసవరం లేదని వ్యాఖ్య
- పివిని అవమానించిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపు
- హుజూరాబాద్‌తో ట్రైలర్ చూపామని వ్యాఖ్య
- కరీంనగర్,మహబూబాబాద్ సభల్లో ప్రధాని మోడీ ప్రచారం
- భారీగా తరలివచ్చిన ప్రజలు

3వ పేజీలో...

## రైతుబంధుకు ఎన్నికల కమిషన్ బ్రేక్

### ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకుంటూ ఉత్తర్వులు

- నిబంధనలు ఉల్లంఘించడం వల్లనే అని వెల్లడి
- ఇసి ఆదేశాలతో నిలిచి పోయిన రైతుబంధు జమ




**హైదరాబాద్, నవంబర్ 27 (సమ సమాజం):** ఎన్నికల ముందు రైతుబంధు పంపిణీకి అనుమతి దక్కడంతో సద్వినియోగం చేసుకోవచ్చని భావించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఊహించని షాక్ తగిలింది. రైతుబంధు పంపిణీని నిలిపివేస్తూ ఇసి ఉత్తర్వులు ఇచ్చింది. నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా నగదు పంపిణీ అనుమతిని ఎన్నికల సంఘం రద్దు చేసింది. దీంతో బీఆర్ఎస్‌కు ఊహించని షాక్ తగిలింది. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏదో ప్రయోజనం ఆశించి చివరి వరకూ రైతుబంధును పంపిణీ చేయకుండా వేచిచూసింది. ఈలోగా ఈసీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని ఈసీ వెనక్కి

3వ పేజీలో...

## కార్తీక పౌర్ణమి పరమపవిత్రం

### శివుడికి అభిషేకాలు..విష్ణువుకు వ్రతాలు

వేములవాడలో పెరిగిన రద్దీ



**వేములవాడ, నవంబర్ 27 (సమ సమాజం):** కార్తీక మాసం అటు శివుడికి, ఇటు విష్ణువుకు ఈ మాసం ఎంతో పవిత్రమైనది కావడంతో కార్తీకంలో ఆయనకు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. వేములవాడలో రద్దీ పెరిగింది. భక్తులు ఉదయం నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు. ముఖ్యంగా పౌర్ణమి నాడు వ్రతాలు, అభిషేకాలు నిర్వహిస్తే మరీ మంచిదని పురాణాలు చెబుతున్నాయి. అలాగ విష్ణువు

3వ పేజీలో...

## పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు

### మూడంచెల సెక్యూరిటీ, సీసీ కెమెరాలతో నిఘా

కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మానిటరింగ్

నగరంలో ఎన్నికల నిర్వహణపై సీపీ సందీప్ శాండిల్య




**హైదరాబాద్,నవంబర్ 27 (సమ సమాజం):** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు మరో మూడు రోజులే ఉండటంతో పోలీసులు గ్రేటర్ హైదరాబాద్‌లోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. మూడు కమిషనరేట్ల పరిధిలో 1,800కు పైగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పోలింగ్ రోజుకు 48 గంటల ముందు నుంచే తమ ఆధీనంలోకి

3వ పేజీలో...

## పరీక్షలు నిర్వహించలేని ప్రభుత్వం ఎందుకు

### నిరుద్యోగులను మోసం చేసేవారిపై చర్యలు ఉండవా

నాయకులకు సవాల్ విసురుతున్న బర్రెలక్క

ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో గుబులు



**కొల్లాపూర్, నవంబర్ 27 (సమ సమాజం):** ఈసారి ఎన్నికల్లో నాగర్‌ర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇక్కడి నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిరుద్యోగి కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పోటీ చేయడంతో పాటు, ఆమె ప్రచార శైలి కూడా ఆకట్టుకుంటోంది. సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ లాంటి వారు కూడా ఆమెకు మద్దతుగా ప్రచారం నిర్వహించడం విశేషం.

3వ పేజీలో...

# రైతుబంధు నిధులు విడుదల చేయకుండా కుట్ర

ప్రభుత్వ తీరుతోనే ఇసి నిర్ణయం ● నెపాన్ని కాంగ్రెస్‌పైకి నెట్టే కుట్ర ● రైతుబంధు నిలిపివేతపై రేవంత్ వ్యాఖ్య



**హైదరాబాద్, నవంబర్ 27 (సమ సమాజం):** రైతుబంధుతో ఓట్లు దండుకోవాలన్న దురాశ, ఆత్రుత, అహంకారం తప్ప నిజంగా రైతులకు మేలు జరగాలన్న ఉద్దేశ్యం మామా - అల్లుళ్లకు లేదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. హరీష్ రావు వ్యాఖ్యల కారణంగానే రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించు కుంటున్నట్టు ఈసీ ఆదేశాలు ఇవ్వడమే దీనికి నిదర్శనమన్నారు. ఈ ద్రోహులను ఇంటికి పంపితే తప్ప రైతులకు న్యాయం జరగదన్నారు. రాష్ట్రంలో రైతులు ఆందోళన చెందవద్దన్నారు. మంత్రి హరీశ్ రావు వల్లే రైతుబంధు ఆగిందని.. కాంగ్రెస్ వచ్చిన 15 రోజుల్లో పైసలిస్తమని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతుబంధు పంపిణీకి ఈసీ ఇచ్చిన అనుమతిని కేసీఆర్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఏదో ప్రయోజనం కోరి చివరి వరకూ రైతుబంధును పంపిణీ చేయకుండా నిలిపివేస్తే.. ఈలోగా ఈసీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని ఈసీ వెనక్కి తీసేసుకుంది. ఈ నెల 24 నుంచి రైతుబంధు అనుమతికి ఎలక్షన్ కమిషన్ అనుమతి ఇచ్చింది. అయితే సీఈసీ నిబంధనలు ఉలంగించి నందుకు అనుమతి రద్దు చేసింది. 'రైతుబంధు' నిధుల విడుదలకు ఈసీ అనుమతి వెనక్కు తీసుకున్న నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి స్పందించారు. ఈసీ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ట్వీట్ చేశారు. 'రైతుబంధుతో ఓట్లు దండుకోవాలన్న దురాశ, ఆత్రుత, అహంకారం తప్ప నిజంగా రైతులకు మేలు చేయాలని ఉద్దేశం మామ, అల్లుళ్లకు లేదు. మంత్రి హరీష్ రావు వ్యాఖ్యల కారణంగానే రైతుబంధుకు ఇచ్చిన అనుమతి వెనక్కు తీసుకుంటున్నట్లు ఈసీ ఆదేశాలివ్వడం దీనికి నిదర్శనం. ఈ ద్రోహులను ఇంటికి పంపితే తప్ప తెలంగాణలో రైతులకు న్యాయం జరగదు. రైతులు ఆందోళన చెందొద్దు. 10 రోజుల్లో కాంగ్రెస్ రాగానే రూ.15 వేల రైతు భరోసా అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తాం.' అని పేర్కొన్నారు.

## మద్యంతో పార్టీల ప్రలోభాలు

ఆరునెలల ముందునుంచే మద్యం సేకరణ ■ పోలింగ్‌కు రెండురోజుల ముందు నిషా

**హైదరాబాద్, నవంబర్ 27 (సమ సమాజం):** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడుతున్న వేళ ప్రధాన పార్టీలన్నీ ఓటర్లకు మద్యం పంపిణీకి రంగం సిద్ధం చేశాయి. మరో రెండు రోజులే మిగలడంతో మద్యంలో ముంచెత్తేలా ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఓటర్లను మందు నిషాలో ముంచెత్తడానికి గ్రామాలకు మద్యం సీసాలు చేరుకుంటున్నాయి. సీసాలు ఎక్కడ నిల్వ ఉన్నాయనే లీకులు ప్రత్యర్థులకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలైన బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక శాతం స్థానిక సంస్థల ప్రతినిధుల వద్దకు లిక్కర్ సీసాలు చేర్చారని అంటున్నారు. కుల సంఘాల సభ్యులకు మద్యం చేరవేసి పంపిణీ చేస్తున్నారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు మేక, గొర్రెపోతులు అందించి ప్రతీ కుటుంబానికి మటన్ సరఫరా చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఓటర్లను ఖుషీ చేయడం తమకూ తప్పదనే ఆలోచనతో మెజార్టీ కాంగ్రెస్ అభ్యర్థులూ మద్యం సరఫరను మొదలు పెట్టారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్నవారు లిక్కర్ కొనుగోళ్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఎలక్షన్ షెడ్యూల్ వచ్చాక మద్యం కొనుగోలు, తరలింపు, డంప్ చేయడం కష్టమవుతోందని ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆరు నెలల నుంచి ప్రతినెలా లిక్కర్ కొనుగోలు చేసి సీక్రెట్గా డంప్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో ఒక పార్టీ అభ్యర్థి రూ.18 కోట్ల మందు కొన్నట్లు తెలుస్తోంది. మిగతావారు రూ.10 కోట్ల విలువకు కాస్త అటుఇటుగా సేకరించి పెట్టుకున్నారు. ఏ ప్రాంత వైన్సులలో లిక్కర్ కొనుగోళ్లు ఎక్కువగా ఉన్నాయనే విషయాన్ని తెలుసుకునేందుకు రికార్డులు పరిశీలించారు. గడిచిన ఆరు నెలల సేల్స్ సమాచారాన్ని చూసి ఆశ్చర్య పోతున్నారు. ఆరు నెలల ముందు నుంచే మద్యం కొనుగోళ్లు చేసి సురక్షిత ప్రాంతాల్లో డంప్ చేశారని తెలుస్తోంది. ఎన్నికలకు ఒకటిరెండు రోజుల ముందుగా వీటిని పంపిణీ చేస్తారు.

## తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతోంది



బిఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం ఖాయం

నోట్ల కట్టలతో గెలవాలనుకున్న వారికి ఓటమి తప్పదు

రైతుబంధుపై కావాలనే బిఆర్ఎస్ డ్రామాలు

ఖమ్మం ప్రచారంలో మాజీమంత్రి తుమ్మల

**ఖమ్మం, నవంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతుందని ఆ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని అన్నారు. తెలంగాన ఇచ్చిన సోనియాకు ప్రజలు జైకొట్టడం ఖాయమని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం 20వ డివిజన్‌లో తుమ్మల రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 80 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించ బోతుందన్నారు. ఖమ్మంలో నలభై నుంచి యాభై వేల మెజార్టీతో కాంగ్రెస్ జెండా ఎగరనుందని స్పష్టం చేశారు. నోట్ల కట్టలతో గెలవాలనుకునే వారు ప్రజా బలం ముందు ఓడి పోవాల్సిందే అని తెలిపారు. అవినీతి సొమ్ముతో అధికార మదంతో ఖమ్మం లో తిరుగుతున్నారని మండిపడ్డారు. అరాచక అవినీతి పాలన తరమి కొట్టాలన్నారు. భూ కబ్జాలు లేని ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు. రైతుబంధుతో ఓట్లు దండుకోవాలన్న దురాశ, ఆత్రుత, అహంకారం తప్ప నిజంగా రైతులకు మేలు జరగాలన్న ఉద్దేశ్యం కెసిఆర్‌కు లేదని, అందుకే ఇసి అనుమతించినా చెల్లింపుల్లో ఆలస్యం చేసి, కాంగ్రెస్‌పై నెపం నెట్టాలని నిర్ణయించుకున్నారని అన్నారు. హరీష్ రావు వ్యాఖ్యల కారణంగానే రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించు కుంటున్నట్టు ఈసీ ఆదేశాలు ఇవ్వడమే దీనికి నిదర్శనమన్నారు. ఈ ద్రోహులను ఇంటికి పంపితే తప్ప రైతులకు న్యాయం జరగదన్నారు. రాష్ట్రంలో రైతులు ఆందోళన చెందవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పదిహేను రోజుల్లో ఇచ్చిన హామీ మేరకు డబ్బులను జమచేస్తుందని తుమ్మల అన్నారు. మంత్రి హరీశ్ రావు వల్లే రైతుబంధు ఆగిందని.. కాంగ్రెస్ వచ్చిన 15 రోజుల్లో పైసలిస్తమని తెలిపారు. రైతుబంధు పంపిణీకి ఈసీ ఇచ్చిన అనుమతిని కేసీఆర్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయిందన్నారు. ఏదో ప్రయోజనం కోరి చివరి వరకూ రైతుబంధును పంపిణీ చేయకుండా నిలిపివేస్తే.. ఈలోగా ఈసీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని ఈసీ వెనక్కి తీసేసుకుంది. ఈ నెల 24 నుంచి రైతుబంధు అనుమతికి ఎలక్షన్ కమిషన్ అనుమతి ఇచ్చింది. అయితే సీఈసీ నిబంధనలు ఉలంగించి నందుకు అనుమతి రద్దు చేసింది. 'రైతుబంధు' నిధుల విడుదలకు ఈసీ అనుమతి వెనక్కు తీసుకున్న నేపథ్యంలో ఈసీ నిర్ణయాన్ని స్వాగతించారు. 'రైతుబంధుతో ఓట్లు దండుకోవాలన్న దురాశ, ఆత్రుత, అహంకారం తప్ప నిజంగా రైతులకు మేలు చేయాలని ఉద్దేశం లేదని తెలిపోయిందని అన్నారు. మంత్రి హరీష్ రావు వ్యాఖ్యల కారణంగానే రైతుబంధుకు ఇచ్చిన అనుమతి వెనక్కు తీసుకుంటున్నట్లు ఈసీ ఆదేశాలివ్వడం దీనికి నిదర్శనం అన్నారు. ఈ ద్రోహులను ఇంటికి పంపితే తప్ప తెలంగాణలో రైతులకు న్యాయం జరగదన్నారు.

## కాంగ్రెస్ ఫిర్యాదుతోనే రైతుబంధుకు బ్రేక్

మంత్రి హరీష్ రావు ఆగ్రహం



**హైదరాబాద్, నవంబర్ 27 (సమ సమాజం):** రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని ఈసీ వెనక్కు తీసుకోవడం వెనుక హరీష్ రావు ఉన్నారని.. ఆయన వ్యాఖ్యలను బేస్ చేసుకునే ఈసీకి ఫిర్యాదులు వెళ్లాయని సమాచారం. రైతుబంధును ఫలానా టైమ్‌కి వేస్తామని హరీష్ చెప్పారని ఆయన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకున్న ఈసీ.. రైతుబంధును నిరాకరించిందని తెలుస్తోంది. దీనిపై హరీష్ క్లారిటీ ఇచ్చారు. రైతుబంధుకు ఈసీ అనుమతి ఇచ్చిందని చెప్పానని.. అందులో తప్పేముందని ప్రశ్నించారు. నోటి దగ్గరి ముద్దను కాంగ్రెస్ అడ్డుకుంటోందన్నారు. ఓట్ల కోసం తాము రైతుబంధు తేలేదన్నారు. తెలంగాణ రైతులతో కేసీఆర్‌ది పేగుబంధం అన్నారు. కాంగ్రెస్ నేతలవన్నీ ఝూటా మాటలని హరీష్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ హామీలను నెరవేర్చారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. యాసంగి పంటకు రైతుబంధు ఇవ్వొద్దని కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారని హరీష్ రావు పేర్కొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ అధికారం ఖాయం

ప్రజలు బిఆర్ఎస్‌ను ఇంటికి పంపిస్తారు

మీడియా సమావేశంలో సచిన్ పైలట్ వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఏఐసీసీ జాతీయ నాయకులు, రాజస్థాన్ ఎమ్మెల్యే సచిన్ పైలెట్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియా పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగిందని అన్నారు. కెసిఆర్ తీరుతో ప్రజలు విసిగి పోయారని అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. రాహుల్ గాంధీ , ఖర్గే , ప్రియాంకా గాంధీల పర్యటనలకు మంచి స్పందన వస్తుందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. నిరుద్యోగం పెరిగి పోతుందన్నారు. ప్రజలు ప్రభుత్వ మార్పు కోరుకుంటున్నారన్నారు. భారత్ జోడోయాత్ర ద్వారా రాహుల్ గాంధీ 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారని అన్నారు. ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లతో పాటు తెలంగాణలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని మరోసారి స్పష్టం చేశారు. 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని.. వారికి క్రెడిబిలిటి లేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేదు.. నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. కర్ణాటక విజయం తరువాత జరుగుతున్న తెలంగాణ ఎన్నికల్లో కూడా అలాంటి ఫలితమే వస్తుందని చెప్పుకొచ్చారు. ఓట్ ఫర్ చేంజ్ అని.. మార్పు కోసమే ప్రజలు ఓటేయబోతున్నారని అన్నారు. రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి బహుమతిగా ఇవ్వాలని కోరారు. రాజస్థాన్‌లో 5 సంవత్సరాలకోసారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయం ఉందని తెలిపారు. సంప్రదాయాన్ని బ్రేక్ చేసి రాజస్థాన్‌లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజస్థాన్‌కు ఎలాంటి సహకారం ఇవ్వలేదని.. ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటేశారని తెలిపారు. సీఎం అభ్యర్థి అనేది కాంగ్రెస్‌లో ఉండదని.. అధిష్టానం సీఎంను సెలెక్ట్ చేస్తుందని రాజస్థాన్ ఎమ్మెల్యే సచిన్ పైలెట్ వెల్లడించారు.

# రాష్ట్రంలో మంత్రులకు కౌంట్ డౌన్ మొదలైంది

సైకో జగన్‌కు ఎక్స్‌పైరీ డేట్ ఫిక్స్ ■ కుట్రలతో చంద్రబాబును జైలుకు పంపారు ■ మంత్రుల అవినీతిని జైలకు పంపిస్తాం ■ కోనసీమలో తిరిగి ప్రారంభమైన లోకేశ్ యువగళం



**అంబేద్కర్ కోనసీమ, నవంబర్ 27 (సమ సమాజం):** రాష్ట్రంలో మంత్రులకు కౌంట్ డౌన్ మొదలైందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. తాను ఏ తప్పూ చేయలేదు కనుకే మళ్లీ ఇక్కడ నిలబడ్డానని పేర్కొన్నారు. 'టీడీపీ అధినేత చంద్రబాబును జైలుకు పంపితే నా పాదయాత్ర ఆగుతుందని అనుకున్నారు. వైసీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర ఆగదు. వ్యవస్థలను మేనేజ్ చేసి 53 రోజులు చంద్రబాబును జైల్లో పెట్టారు. నాపై కూడా సీఐడీ కేసులు పెట్టారు. ఇప్పటి వరకూ 6 కేసులు పెట్టినా ఒక్క ఆధారం లేదు. స్కిల్ కేసులోనూ ఒక్క ఆధారం చూపలేకపోయారు. ఆనాడు పవన్ కల్యాణ్ వస్తుంటే ఎలా అడ్డుకున్నారో చూశాం. ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి. అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లించే బాధ్యత నేను తీసుకుంటా.' అని లోకేశ్ వ్యాఖ్యానించారు. స్కిల్ కేసులో తమ పార్టీ ఖాతాలోకి డబ్బు వచ్చిందని నిరూపించగలరా.? అంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. వైసీపీ నేతలు అన్న క్యాంటీన్లపైనా కేసులు పెడతారని, ఏం చేసినా వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు. సైకో జగన్‌కు ఎక్స్ పైరీ డేట్ ఫిక్స్ అయ్యిందని.. మూడు నెలల్లో సైకో పిచ్చాసుపత్రికి ప్యాకప్ అంటూ నారా లోకేష్ వ్యాఖ్యలు చేశారు. సోమవారం రాజోలు నియోజకవర్గం పాదలాడలో 210వ రోజు పాదయాత్రను యువనేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రకు 79 రోజులు బ్రేక్ ఇచ్చినందుకు క్షమించాలన్నారు. పాదయాత్రలో అన్ని వర్గాల వారిని కలిసి వారి సమస్యలు తెలుసుకున్నానని.. టీడీపీ - జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే అందరి కష్టాలు తీరుస్తానని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి వంద కిలోమీటర్ల పాదయాత్రకు గుర్తుగా ప్రత్యేక హామీలు ఇచ్చానన్నారు. వైసీపీ నాయకుల అవినీతిని భయటపెట్టానని.. ఒక్క ఛాన్స్ పేరుతో జగన్ చేస్తున్న దోపిడీ భయటపెట్టానని చెప్పారు. పాదయాత్ర మొదలుపెట్టిన మొదటి రోజు నుంచే సైకో జగన్ అడ్డుకోవడానికి స్కెచ్‌లు వేశారన్నారు. అన్న ఎన్టీఆర్ ఇచ్చిన గొంతు ఆపే మగాడు పుట్టలేదని... ముందే చెప్పా సాగనిస్తే పాదయాత్ర... అడ్డుకుంటే దండయాత్ర అని యువనేత హెచ్చరించారు. చంద్రబాబును అరెస్ట్ చేసి యువగళం పాదయాత్రను సైకో జగన్ ఆపారని మండిపడ్డారు. చంద్రబాబును చూస్తే సైకోకు భయమని.. సొంత అమ్మని, చెల్లిని చూసినా జగన్‌కు భయమే అని వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుపై అనేక కేసులు పెట్టారని మండిపడ్డారు. పార్టీ అకౌంట్‌లోకి రూ.27 కోట్లు వచ్చాయంటున్నారని.. అరేయ్ ఫూల్స్ అవి తమ కార్యకర్తలు సభ్యత్వం కోసం చెల్లించిన రుసుము అంటూ విరుచుకుపడ్డారు.ఒక్క రూపాయి అవినీతి జరిగినట్టు రుజువు చెయ్యగలిగారా?అని ప్రశ్నించారు. హైకోర్టులో నిజం గెలిచిందన్నారు. తనపై కూడా అనేక కేసులు పెట్టారని.. సీఐడీ విచారణకు పిలిచారని అన్నారు. తప్పు చేస్తే చంద్రబాబే తనను వదిలిపెట్టరన్నారు. 'ఆఖరికి మా అమ్మ భువనమ్మ, నా భార్య బ్రాహ్మణిపై కూడా కేసులు పెడతాం అరెస్ట్ చేస్తాం అని మంత్రులు మాట్లాడారు. ఆ మంత్రులకు భయం పరిచయం చేసే బాధ్యత నాది' అని హెచ్చరించారు. సైకో బెదిరింపులకు, ఉడత ఊపులకు తాము భయపడలేదని స్పష్టం చేశారు. ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్ని ఇబ్బందులు పడినా ఓర్చుకున్నామన్నారు. ఒక పక్క యువగళం, మరోపక్క చంద్రబాబు భవిష్యత్తుకి గ్యారంటీ, మరోపక్క పవన్ కళ్యాణ్ వారాహి యాత్రతో సైకో భయంతో వణికిపోయారన్నారు. ఈ మూడు కార్యక్రమాలు ఆపాలనే అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 53 రోజుల పాటు ప్రజా పోరాటం జరిగిందని.. చంద్రబాబు గొప్పతనం ప్రపంచం అంతా తెలిసిందన్నారు. ల్యాండ్, స్యాండ్, వైన్, మైన్ మాఫియా డాన్‌గా మారిన పిచ్చోడు మూడు నెలల్లో పర్మినెంట్‌గా జైలుకి పోవడం ఖాయమన్నారు. 'అవినీతికి పాల్పడిన టోటల్ వైసీపీ ఇన్ జైల్. జైలర్ ఎవరో తెలుసా... చంద్రబాబు .. మీ తాట తీస్తారు. ఇది ఖాయం రాసిపెట్టుకోండి' అని హెచ్చరించారు. మూడు నెలలు ఓపిక పట్టాలని టీడీపీ కార్యకర్తలను వేధించిన వైసీపీ వారికి వడ్డీతో సహా చెల్లిస్తా అని లోకేష్ స్పష్టం చేశారు. దాదాపు రెండున్నర నెలల సుదీర్ఘ విరామం అనంతరం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర సోమవారం నుంచి పునఃప్రారంభమైంది. స్కిల్ డెవలప్మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో పాదయాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడగా, దాదాపు 79 రోజుల విరామం అనంతరం ఎక్కడ ఆపేశారో అక్కడి నుంచే లోకేశ్ పాదయాత్ర మొదలుపెట్టారు.ఈ క్రమంలో టీడీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. పాదయాత్రలో భాగంగా పి.గన్నవరం పరిధిలో గెయిల్, ఓఎన్జీసీ బాధితులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. సెప్టెంబరు 8న లోకేశ్ యాత్ర రాజోలు మీదుగా పొదలాడ చేరుకుంది. ఆ మరుసటి రోజు చంద్రబాబు అరెస్టు కావడంతో లోకేశ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. చంద్రబాబుకు ఇటీవల బెయిల్ మంజూరు కావడంతో యాత్రను మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే, ఈసారి షెడ్యూల్ మార్పు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజోలు, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ నగరం, కాకినాడ గ్రామీణం, పిఠాపురం, తుని నియోజకవర్గాల మీదుగా యాత్ర సాగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రోజుకు 15 కి.మీ. నుంచి 20 కి.మీ. మేర పాదయాత్ర, మధ్యలో బహిరంగ సభలు, స్థానికులతో ముఖాముఖి నిర్వహిస్తూ లోకేశ్ ముందుకు సాగనున్నారు.

# తెల్ల రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్

సన్నబియ్యంతో పాటు ఐదులక్షల బీమా: కెటీఆర్



**పెద్దపల్లి, నవంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మరో రోజు మాత్రమే గడువుండడంతో బీఆర్ఎస్ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఈ క్రమంలో మంత్రి కేటీఆర్ సోమవారం పెద్దపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రెండు కొత్త పథకాలు తీసుకువస్తున్నామని చెప్పారు. ఒకటి సన్నబియ్యం, రెండోది రూ. ఐదు లక్షల కేసీఆర్ జీవిత బీమా.. ఈ రెండు పథకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే అసైన్డ భూములు ఉన్నవారికి మంత్రి శుభవార్త చెప్పారు. డిసెంబర్ 3 తర్వాత అసైన్డ భూములు ఉన్నప్రతి ఒక్కరికి పూర్తి స్థాయి యాజమాన్య హక్కు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణను నాసనం చేసిన కాంగ్రెస్ పార్టీకి మళ్లీ అవకాశం ఇస్తే కరెంట్ కట్ అవుతుందని, రైతు బంధు ఆగిపోతుందని, ప్రజల జీవితాలు నాశనమవుతాయి తప్ప.. ఆ పార్టీవల్ల ఏమీకాదని మంత్రి కేటీఆర్ ప్రజలనుద్దేశించి వ్యాఖ్యానించారు. పొరపాటున కూడా కాంగ్రెస్‌ను నమ్మొద్దన్నారు. అదీ.. ఇదీ గ్యారంటీ అంటూ కాంగ్రెస్ వాళ్లు చెబుతున్నారని, వాళ్ల సీఎం సీటుకే గ్యారంటీలేదని మంత్రి ఎద్దేవా చేశారు. ఆరు నెలలకొకసారి ముఖ్యమంత్రులు మారడం గ్యారంటీ అని అన్నారు. రైతు బంధు ఆపిన పార్టీకి ఓటేస్తారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# కాంగ్రెస్ అంటే కరెంట్ కట్




(మొదటి పేజీ తరువాయి) మొన్న కూడా పీఆర్సీ అపాయింట్ చేశాం. మళ్ల కూడా మంచి పీఆర్సీ ఇచ్చుకుందాం. బ్రహ్మాండంగా డీఏలు కూడా ఇచ్చుకుందాం అని కేసీఆర్ తెలిపారు. ఒాటితో పాటు ఉద్యోగల సంక్షేమాన్ని చూశాం. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు కొంత మంది ఉన్నారు. చాలా మందిని రెగ్యులరైజ్ చేశాం. వాళ్లు పోను మిగతా ఎవరైతే ఉన్నారో పీఆర్సీ ఉద్యోగులకు 30 శాతం ఇస్తే, ఆ చిన్న ఉద్యోగుల కడుపు నింపాలని వాళ్లకు కూడా 30 శాతం జీతాలు పెంచినం. ఇది ఎప్పుడు చరిత్రలో జరగలేదు. ఎక్కడ జరగదు. ఆర్టీసీ ఉద్యోగులు మా ఉద్యోగాలు పోతాయని దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టు ఉండేవారు. వాళ్లు ÷ట్ చేశారు. మొన్ననే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాం. గవర్నర్ లేట్ చేయడం వల్ల ఆలస్యమైంది. గవర్నమెంట్ వచ్చిన తెల్లారి.. నెలలోపు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చేస్తాం. ఇలా అందర్నీ సమదృష్టితో సమాజంలో ఉండే ప్రతి ఒక్కరిని కులం, మతం అనే తేడా లేకుండా ముందుకు తీసుకుపోవాలని ప్రయత్నం చేస్తున్నాం అని కేసీఆర్ స్పష్టం చేశారు.

# తొమ్మిదేళ్లలో దగాపడ్డ తెలంగాణ



(మొదటి పేజీ తరువాయి) కోరారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం కళ్లు మూసుకుని నిద్రపోతోందని, వ్యవసాయం చేసుకునే రైతులకు లోన్లు రావని, రుణమాఫీ జరగదని, ప్రజల సమస్యలు పట్టించుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదని మండిపడ్డారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎంతో కష్టపడి చదివి, పరీక్షలు రాస్తే.. ఆ ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని ఆమె ఆరోపించారు. పై నుంచి కింద వరకు ఈ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా అవినీతి మయమేనని, కళేశ్వరం ప్రాజెక్టులో ఎంత అవినీతి జరిగిందో అందరికీ తెలిసిన విషయమనని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అధికారం కోసం చూస్తాయని, ప్రజల కష్టాలను పట్టించుకోవని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తేవడం కోసం మీ హక్కును అమ్ముకోరనే విషయాన్ని ఈ ఎన్నికల ద్వారా తెలియజేయాలని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని ప్రియాంక గాంధీ అన్నారు.

# తెలంగాణలో బిజెపి ప్రచారహోరు



(మొదటి పేజీ తరువాయి) **మహబూబాబాద్/కరీంనగర్, నవంబర్ 27 (సమ సమాజం):** మరో 24 గంటల్లో తెలంగాణ ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో పార్టీలు జోరుగా ప్రచారం నిర్వహించారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అగ్రస్థాయి నేతలు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. మహబూబాబాద్,కరీంనగర్‌లో బీజేపీ సకలజనుల విజయ సంకల్ప సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాబోతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆట ముగియనుంది. మొదటిసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాబోతోంది. తెలంగాణ బీజేపీ తొలి సీఎం బీసీయే అవుతారు. చరిత్రలో 16 మహాజనపదాల్లో అస్మక జనపదం ఈ ప్రాంతం. హుజూరాబాద్ ఉపఎన్నికతో కేసీఆర్‌కు ట్రైలర్ చూపించాం. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు పూర్తి సినిమా చూపిస్తారు' అని ప్రధాని మోదీ అన్నారు. పీవీ నరసింహారావుని కాంగ్రెస్ పార్టీ ప్రతి అడుగులో అవమానించిందని హస్తం పార్టీపై ఆయన విరుచుకుపడ్డారు. తెలంగాణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సర్కార్లు అవసరం లేదని మోదీ అన్నారు. గ్యారెంటీలను నెరవేర్చే మోదీ సర్కార్ తెలంగాణకు అవసరమని అన్నారు. మోదీ గ్యారెంటీ అంటే అందరికీ ఉచిత వైద్యం అందిస్తామని అన్నారు. మోదీ గ్యారెంటీ అంటే అందరికీ ఆరోగ్యం, మోదీ గ్యారెంటీ అంటే రైతులకు చేయూత అని అన్నారు. ప్రజా సంక్షేమమే బీజేపీ ప్రాధాన్యతని, ఓ వైపు కేసీఆర్ ఉన్నారు.. మరో వైపు మీ సేవకుడు మోదీ ఉన్నాడని ప్రధాని అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన బీజేపీ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనను ఎండగట్టారు. ప్రధాని మోదీ పదే పదే తెలుగులో మాట్లాడుతూ, తెలుగు పదాలు చెబుతూ బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా కేసీఆర్ కుటుంబపాలనతో ఏ లక్ష్యాలు నెరవేరలేదని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలకు బదులుగా బీఆర్ఎస్ ప్రభుత్వం కన్నీళ్లు, మోసాలు, నిరుద్యోగాలతో అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ మీద పన్ను తగ్గించాం. కానీ తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో పెట్రోల్ మీద పన్ను తగ్గించలేదన్నారు. తద్వారా ప్రజల మీద భారం పడిందని, కేసీఆర్ పాలనకు ఇది నిదర్శనం అన్నారు. ఇప్పటికే పదేళ్లు గడిచిపోయాయని, వచ్చే ఐదేళ్లు తెలంగాణ ప్రజల భవిష్యత్ కు చాలా కీలకమన్నారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు తపన పడుతున్నారని, వారి కలలు సాకారం కావాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభివృద్ధి కోరుకుంటే కమలం గుర్తుకు మీ ఓటు వేయాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబపార్టీలు అని, వారి వల్ల కేవలం ఒకట్రెండు కుటుంబాలు బాగుపడతాయని, రాష్ట్రంలోని అన్ని వర్గాలవారికి అన్యాయం జరుగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలిస్తే పీఎఫ్ఐ లాంటి ఉగ్రవాద సంస్థలకు ఊతం వస్తుందని, కనుక ప్రజలు ఆలోచించి ఓటు వేసి వారి బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని ప్రజలకు సూచించారు.తెలంగాణ సీఎం కేసీఆర్ కు మూఢ నమ్మకాలు ఎక్కువ అని, అందుకే సచివాలయం కూల్చేశారని ప్రధాని నరేంద్ర మోదీ మహబూబాబాద్ సభలో విమర్శించారు. అంధ విశ్వాసాలతో ప్రజాధనం వృథా చేసిన ఘనుడు కేసీఆర్ అన్నారు. తన నమ్మకాల కోసం ప్రజా ధనం వృథా చేసి సెక్రటేరియట్ కూల్చివేసిన సీఎం కేసీఆర్ మనకు అవసరమా అని మోదీ ప్రశ్నించారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పసభలో పాల్గొన్న మోదీ మాట్లాడతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్ పై విమర్శలు చేశారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ప్రజలు సీఎం కేసీఆర్ కు ట్రైలర్ చూపించారని, అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం సినిమా చూపిస్తారంటూ సెటైర్లు వేశారు. తెలంగాణలో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతోందని, అవినీతిపరులను కచ్చితంగా జైలుకు పంపిస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణను నాశనం చేశాయని, బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ తమతో దోస్తీ కోసం ప్రయత్నించారని, అందులో భాగంగా గతంలో కేసీఆర్ దిల్లీకి వచ్చి బీజేపీతో కలిసి పనిచేస్తామని అడిగినట్లు మరోసారి ప్రధాని ప్రస్తావించారు. అయితే తన కుమారుడు మంత్రి కేటీఆర్ ను తెలంగాణకు సీఎంగా చేయాలని కోరగా.. కేసీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించడంతో తమపై విమర్శలు మొదలుపెట్టారని పేర్కొన్నారు.

# రైతుబంధుకు ఎన్నికల కమిషన్ బ్రేక్








(మొదటి పేజీ తరువాయి) తీసుకుంది. ఈ నెల 24 నుంచి రైతుబంధు అనుమతికి ఎలక్షన్ కమిషన్ అనుమతి ఇవ్వడం, విపక్షాలు మండిపడిన విషయాలు తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్‌ను ఉల్లంఘించకుండా ఈ నెల 24 నుంచి రైతు బంధును పంపిణీ చేస్తామంటూ ఈ నెల 18న సీఈసీని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇది ఇప్పటికే కొనసాగుతున్న పథకమని, కొత్తది కానందున అనుమతి ఇవ్వాలని విన్నవించింది. దీంతోపాటు రైతు రుణ మాఫీ, ఉద్యోగుల కరువు భత్యాల (డీఏ) అమలుకు అనుమతించాలని కోరింది. శుక్రవారం రైతు బంధు పంపిణీకి సీఈసీ ఓకే చెప్పింది. రుణ మాఫీ, ఉద్యోగుల డీఏలపై ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఏటా యాసంగి రైతుబంధును నవంబరు, డిసెంబరుల్లోనే పంపిణీ చేస్తున్నారు. ఈ సారి నవంబరు ముగుస్తున్నా, సీజన్ ముంచుకొస్తున్నా నగదు సాయంపై స్పష్టత లేకపోవడంతో పెట్టుబడికి ఇబ్బంది తలెత్తుతుందని రైతులు కలత చెందారు. ఈ నేపథ్యంలో సీఈసీ అనుమతించింది. అయితే కొన్ని నిబంధనలు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా ఈ నెల 24 నుంచి రైతుబంధు పంపిణీ చేయొచ్చంటూ అనుమతిచ్చింది. నగదు సాయానికి అనుమతి ఇస్తూనే సీఈసీ షరతులు విధించింది. ఎన్నికల ప్రచారం ముగిశాక పంపిణీ చేయొద్దని స్పష్టం చేసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు అంటే, ఈ నెల 28తో ప్రచార ఘట్టం ముగుస్తుంది. అంటే సోమవారం మాత్రమే రైతుబంధు పంపిణీకి ప్రభుత్వానికి అనుమతి ఉంది. ఈలోపే రైతుబంధు పంపిణీకి ఈసీ అనుమతి నిరాకరించింది. ఈ నెల 25, 26, 27 తేదీల్లో బ్యాంకులకు సెలవులు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 29, 30 తేదీల్లో పంపిణీకి అనుమతి లేదని వివరించింది. దీనికి తగినట్లు రైతుబంధును డీబీటీ పద్ధతిలో జమచేస్తామని తెలిపింది. ఎందుకోగానీ డీబీటీ పద్ధతిలో జమ చేస్తామన్న ప్రభుత్వం చేయకుండా తాత్సారం చేసింది. దీంతో ఫిర్యాదులు వెళ్లడం.. అనుమతి నిరాకరించడం చకచకా జరిగి పోయాయి.

# పరీక్షలు నిర్వహించలేని ప్రభుత్వం ఎందుకు




(మొదటి పేజీ తరువాయి) మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ నుంచి పోటీ పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మరోమారు రంగంలో ఉన్నారు. వీరికి బర్రెలక్క చెమటలు పట్టిస్తున్నారు. ఆమె.. నిరుద్యోగుల గొంతుకగా ఎన్నికల బరిలో నిలిచింది. పోటీ నుంచి తప్పుకోకపోతే చంపేస్తామని రోజూ వందలకొద్దీ బెదిరింపులు వస్తున్నా ధైర్యంతో ముందుకెళ్తున్నది. తన తమ్ముడిపై దాడి జరిగినా వెనక్కి తగ్గేది లేదని, పోరాటం ఆపేది లేదని స్పష్టం చేసింది. పోలింగ్ దగ్గరపడుతున్న కొద్దీ శిరీషకు నిరుద్యోగుల తో పాటు ప్రజా సంఘాలు, మేధావులు, వివిధ వర్గాల నుంచి మద్దతు పెరుగుతోంది. బర్రెలక్కకు ఓటు వేయాలని యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు కోరుతున్నారు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఆమె ఎవరి ఓట్లు చీలుస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం పెద్ద కొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన శిరీష(26) తల్లి రోజువారీ కూలీ. ఆమెకు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తండ్రి వీళ్లకు దూరంగా ఉంటున్నాడు. శిరీష ఓపెన్ డిగ్రీ చేస్తూనే కుటుంబానికి ఆసరాగా ఉండాలని నాలుగు బర్రెలు కొనుక్కుంది. వాటిని మేపుతూ వీడియోలు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేది. హాలో ఫ్రెండ్స్.. ఎంత చదివినా ఉద్యోగాలు వస్తలేవ్. అందుకే నాలుగు బర్లను కొనుక్కున్న.. పాలమ్మితే రోజుకు మూడు వందలు ఎక్కడికిపోవు' అంటూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యపై ఆమె చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ తర్వాత వివిధ సమస్యలపై వీడియోలు చేసి విపరీతమైన క్రేజ్ సంపాదించుకుని బర్రెలక్కగా ఫేమస్ అయింది. డిగ్రీ పూర్తయ్యాక తప్పనిసరి పరిస్థితుల్లో బర్రెలను అమ్ముకున్న శిరీష.. హైదరాబాద్?కు వెళ్లి పోటీ పరీక్షలకు సిద్ధమైంది. నోటిఫికేషన్ పడిన ప్రతి పోస్టుకూ అప్లయ్?చేసింది. అయితే క్వశ్చన్ పేపర్ల లీకేజీలు, పరీక్షల వాయిదాలతో విసిగిపోయి తిరిగి ఊరికి వచ్చేసింది. రాని సర్కారీ నౌకరి కోసం జీవితాలను ఎందుకు బలి చేసుకోవాలని ప్రశ్నించే శిరీష.. అసెంబ్లీ ఎన్నికలే సరైన వేదిక అని నిర్ణయించుకుని, కొల్లాపూర్ నుంచి నామినేషన్ వేసింది. మొన్నటి దాకా తమాషాకు వీడియోలు చేస్తుందనుకున్న అమ్మాయి.. నిరుద్యోగుల ప్రతినిధిగా ఎన్నికల బరిలో నిలవడం, బెదిరింపులకు లొంగకుండా హేమాహేమీలతో తలపడ్తుండడంతో ఇప్పుడు రాష్ట్రమంతా బర్రెలక్క వైపు చూస్తోంది. గ్రామగ్రామాన తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తోంది. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు, విద్య, వైద్య రంగాల దుస్థితి తదితర అంశాలను ప్రస్తావిస్తోంది. ప్రత్యేకంగా మేనిఫెస్టో కూడా ప్రకటించింది. కాగా, బెదిరింపులు, దాడుల నేపథ్యంలో బర్రెలక్కకు సెక్యూరిటీ కల్పించాలని హైకోర్టు ఆదేశించడంతో ఆమె పేరు మరోమారు వార్తల్లోకి ఎక్కింది. పరీక్షలు సక్కగా రాయకపోతే ఫెయిల్ చేస్తరు. అసలు పరీక్షలే సక్కగా పెట్టలేని ప్రభుత్వాలను ఏం చేయాలని ఆమె తన ప్రచారంలో ప్రజలకు వేస్తున్న ప్రశ్న ఆలోచించే దిగా ఉంది.తనకు జనం నుంచి మంచి స్పందన వస్తున్నదని శిరీష తెలిపారు. నా దగ్గర డబ్బు లేదు. అందుకే చాలామంది చందాలు ఇస్తున్నారు. నేను పైసలు పంచను. మందు పొయ్యను. కానీ జనాలు వచ్చి, నేను చెప్పింది శ్రద్ధగా వింటున్నారు. 'నువ్వు ఓడిపోతే మేము ఓడిపోయినట్టే' అని అంటున్నారు. అది చాలు తను పోరాటానికి మద్దతు అంటున్నారు. ఇది నా ఒక్కదాని సమస్య కాదు. రాష్ట్రంలోని 40 లక్షల మంది నిరుద్యోగుల సమస్య. మా నిరుద్యోగ అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల సమస్య ఇది. వాళ్ల ఇంటి నుంచే పోరాటం మొదలు కావాలని పిలుపునిచ్చారు. తాను పోటీ చేస్తే, వివిధ పార్టీల లీడర్లు ఎందుకంత భయపడు తున్నారని శిరీష ప్రశ్నించారు. పేదలకు మంచి చేసేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. నన్ను బెదిరించిన ప్రతి ఒక్కరి వివరాలు నా దగ్గర ఉన్నాయి. అవన్నీ ఎన్నికల తర్వాత వెల్లడిస్తాను. నన్ను చంపినా వెనకడుగు వేయను. నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు అందరితో కలిసి పోరాడుతాను అంటూ తన ధృఢ సంకల్పాన్ని ప్రకటించారు. ఇకపోతే శిరీష పోటీ చేయడంతో రాజకీయ పార్టీలకు మింగుడు పడటం లేదన్నారు. పేదరికంతో ఉన్నా.. ప్రజాస్వామ్య వ్యవస్థల మీద పెను ప్రభావం చూపవచ్చని ముక్కుపచ్చలారని బర్రెలక్క నిరూపించింది. దశాబ్దాల అనుభవాల దొంతరపొత్తు చెప్పే బీసీ నాయకులు శిరీషను చూసి సిగ్గు పడాలి. బీసీల రాజ్యాధికారం చందాల దందాల కాదనే ఆగిపోతే...వారి నాయకులు చెల్లని రూపాయి అవుతారు. ప్రజాస్వామ్య హక్కును బర్రెలక్క తన లక్కుగా మార్చుకుంది. కోట్ల డబ్బుతో గెలుద్దాం అనుకున్న నాయకులను గడగడలాడిస్తున్నది. వ్యాపారం, రాజకీయం కలిసిపోయి రాజకీయాలను ధనస్వామ్యంగా మార్చేశాయి. ఈ నేపథ్యంలో శిరీషను అందరూ కలిసి ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

# పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు




(మొదటి పేజీ తరువాయి) తీసుకోనున్నారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట సీసీ కెమెరాలను అమర్చుతారు. వీటిని బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో లింక్ చేయనున్నారు. ఇందుకు సిటీ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య, రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. డీసీపీ నుంచి లోకల్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో మానిటరింగ్ చేస్తున్నారు. పోలింగ్ బందోబస్తుకు స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో కలిపి 40 వేలకు పైగా మందితో కొనసాగిస్తారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బందోబస్తుపై సిటీ సీపీ సందీప్ శాండిల్య సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్‌తో కలిసి ఆయన సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రత చర్యలు తీసుకునే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఈవీఎంలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో గొడవలు జరిగిన ప్రాంతాలను గుర్తించారు. ఓల్డ్ సిటీతో సహా అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమస్యాత్మక కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్స్,సెంట్రల్ ఆర్మ్ డ్ పోలీస్ ఫోర్స్‌ను మోహరిస్తారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తారు. కేంద్రానికి100 మీటర్ల దూరంలో ఓటర్లను మినహా ఇతరులను అనుమతించరు. సిటీలో ఏడుగురు డీసీపీలు, 28 మంది ఏసీపీలు, 9 టాస్క్‌ఫోర్స్ టీమ్స్,9 స్పెషల్ ఫోర్సెస్,71 మంది ఇన్‌స్పెక్టర్లు,125 మంది ఎస్ఐలు పోలింగ్?బందోబస్తులో ఉంటారు.391 రూట్ మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక్కో టీమ్‌లో కానిస్టేబుల్ సహా ఆయుధాలు కలిగిన మరో ముగ్గురు కానిస్టేబుల్స్ ఉంటారు. వీటితో పాటు 129 పెట్రోలింగ్ వెహికల్స్, 220 బ్లూ కోల్ట్స్,122 ఇతర వాహనాల్లో పోలీసులు తిరుగుతుంటారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశామని హైదరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్య తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహణపై ఇప్పటికే ఏరియా డీసీపీలకు దిశానిర్దేశం చేశామన్నారు.. ప్రతి పోలింగ్ సెంటర్‌లో మహిళా కానిస్టేబుల్‌ను తప్పనిసరిగా ఉంచుతున్నట్లు తెలిపారు. కమ్యూనికేషన్ కోసం అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నాం. గొడవలకు యత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సిపి పిలుపునిచ్చారు.

# టూవీలర్‌ను ఢీకొన్న లారీ ఇద్దరు వ్యక్తులు దుర్మరణం




**కాకినాడ, నవంబర్ 27 (సమ సమాజం):** తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురం మండలం కోమటికుంట గ్రామం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ఘటనా స్థలిలోనే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన మరొకరిని 108 వాహనంలో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి కూడా మృతి చెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కార్తీక పౌర్ణమి పరమపవిత్రం



(మొదటి పేజీ తరువాయి) అలంకార ప్రియుడు. ఈ మాసంలో ఆయనకు నిత్యం పూజలు, అలంకారాలు చేసి ఆరగింపులు చేయాలి. చాలామంది కార్తీకంలో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తారు. అందుకే కార్తీకం పౌర్ణమి నాడు అటు శివాలయాలు, ఇటు వైష్ణవాలయాలు కిటకిటలాడుతాయి. కార్తీకం అంటేనే వ్రతాలు,నోములు, అభిషేకాలకు ప్రత్యేక మాసంగా గుర్తుంచుకోవాలి. ఈ మాసం పరమ పవిత్రంగా పురాణాలు పేర్కొంటున్నాయి. కార్తీకంలో అన్నిరోజులు పవిత్రమే కనుక సూర్యోదయానికి పూర్వమే స్నానాదులు పూర్తి చేసుకొని శివదర్శనం చేసుకొని శివనామస్మరణతో అభిషేకాలు నిర్వహించాలి. రాత్రివేళలో శివలింగానికి పూజలు చేస్తూ జాగరణ చేయాల్సి వుంటుంది. పూజా విధానం, మంత్రాలు తెలియకపోయినప్పటికీ ఉపవాసం, జాగరణం, బిల్వార్చన, అభిషేకంలాంటి వాటిలో పాల్గొంటే చాలు శివానుగ్రహం లభిస్తుంది. సముద్రా, నదీ స్నానాలకు కూడా ఇది పరమ పవిత్రమైన మాసం. కార్తీకమాసం ప్రారంభం కావడంతో తెలుగు రాష్ట్రాలు శివనామస్మరణంతో మార్మోగుతున్నాయి. శివుడిని అభిషేకిస్తే పాపాలు హరిస్తాయని పురాణ ప్రవచనం. అందుకే కార్తీకంలో అభిషేకంతో శివుడిని ప్రసన్నం చేసుకోవాలని మన రుషులు ఆదేశించారు. ఈ మాసంలోల చేసే పూజల వల్ల జీవితాంతం చేసిన పాపాలను హరించుకోవచ్చని చెబుతారు. యావత్ సృష్టిని నడిపించే ఆ శంభుడే అనంత భక్త కోటి కోసం శివలింగంగా ఆవిర్భవించి మనకు సన్మార్గం ఉపదేశించాడని కూడా చెబుతారు. శివ అన్న పదానికి మంగళకరం.. శుభప్రదం అని అర్థం. కైలాసనాథుడైన ఆ పరమేశ్వరుడిని ఉపవాసంతో అభిషేకించి ఫలమో, ప్రాదమో సమర్పించుకుంటే సకల పాపాలు హరిస్తాయి. ప్రపంచంలో అన్ని దేవతామూర్తులను వారి రూపాల్లోనే కొలుస్తాం. అయితే చంద్రశేఖరుడిని మాత్రం లింగంగా పూజించడం ఒక విశిష్టత. నిండు మనస్సుతో, భక్తితో పిలిస్తే చాలు ఆ లింగమూర్తి మనకు ప్రత్యక్షమవుతాడు. సమస్త జగత్తును దహించి వేసేందుకు సిద్ధమైన హాలాహలాన్ని గొంతుకలో దాచుకున్న నీలకంఠుడు. సహధర్మచారిణికి తన శరీరంలో అర్ధభాగమిచ్చిన అర్ధనారీశ్వరుడు రుద్రాక్ష స్వరూపుడు. అందుకే రుద్రాక్షలు కూడా సాక్షాత్తు పరమేశ్వర స్వరూపం. రుద్రాక్షలకు అంత మహత్యమెలా వచ్చిందన్న దానిపై దేవీ భాగవతంలో పూర్తిగా పొందుపరిచారు. త్రిలోక సంచారి నారద మునీంద్రునికి నారాయణ మహర్షి రుద్రాక్షల పవిత్రత గురించి విశదీకరించాడు. రాక్షస సంహారం అనంతరం త్రినేత్రాలను మూసివేసి ఈశ్వరుడు ధ్యానంలో మునిగిపోయారు. ఆ ధ్యానంలోనే స్వామి మూడు కన్నుల నుంచి కన్నీటి బిందువులు రాలాయి. శంభుని నేత్రాల నుంచి వచ్చిన కన్నీటి ధారలతో ఏర్పడిన వృక్షాలు కనుకే రుద్రాక్షలకు అంత పవిత్రత ఏర్పడింది. ఇక విష్ణువు అలంకార ప్రియుడు కావడంతో పాటు, ఆరాధానా ప్రియుడుకూడా. అందుకే కార్తీకంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తారు. ఈ మాసంలో వ్రతాలునిర్వహిస్తే అష్టయిశ్వర్యాలు పొందుతారని ఐతిహ్య. అందుకే కార్తీకంలో స్వామిని సత్యానారాయణుడి రూపంలో పూజిస్తారు.

# బిజెపికి ఓటేస్తే బిసి సిఎం

కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు వేస్తే కటుంబ సిఎం

ఈటెలను భారీ మెజార్టీతో గెలిపించాలి

కరీంనగర్, మంచిర్యాల సభల్లో అమిత్ షా ప్రచారం



**హైదరాబాద్, నవంబర్ 27 (సమ సమాజం):** బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కుటుంబ సీఎం అవుతాడని.. బీజేపీకి ఓటు వేస్తే బీసీ సీఎం అవుతాడని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. హుజూరాబాద్‌లో ఈటెల రాజేందర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మరోమారు ఈటెలను భారీ మె.జార్టీతో గెలిపించాల న్నారు. బీజేపీ గెలిస్తే పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. తెలంగాణాకు మోడీ సర్కార్ ఇప్పటివరకూ ఏడు లక్షల కోట్ల రూపాయలు ఇచ్చిందన్నారు. హుజూరాబాద్ లో జరిగిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అవినీతి పాలన నుంచి ప్రజలకు విముక్తి కలగాలన్నారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య లోపాయకారీ ఒప్పందం ఉందని, తమ వారసులను పదవుల్లో కూర్చోబెట్టాలని ఆ రెండు పార్టీలూ కంకణం కట్టుకున్నాయని అమిత్ షా ఆరోపించారు. ఒవైసీకి భయపడే బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణా విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదనీ, బీజేపీ అధికారంలోకి వచ్చాక విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఆయన చెప్పారు. కరీంనగర్‌లో ఎన్నికల ప్రచారంలో అమిత్ షా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. పేదల తరుపున మాట్లాడినందుకే సీఎం కేసీఆర్ ఈటలపై కక్ష్య పెంచుకొని పార్టీ నుంచి బయటకి పంపారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఒప్పందం జరిగిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను సీఎం, కేంద్రంలో రాహుల్‌ను పీఎం చేయాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటే అని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్ తీసివేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి మోడీ అరవై లక్షలు కోట్లు ఇచ్చారని అమిత్ షా వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీతో సీఎం కేసీఆర్ కుమ్మక్కయ్యారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సోమవారం నాడు మంచిర్యాల ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కేసీఆర్‌కు వేసినట్టేనని అన్నారు. 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొనేశాడని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిస్తే మళ్లీ కేసీఆర్ కొనేస్తాడని అన్నారు. కేసీఆర్‌ను గెలిపిస్తే రాహుల్ బాబాను ప్రధానిని చేస్తాడని అమిత్ షా ఎద్దేవ చేశారు. కేసీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినా రాహుల్ ప్రభుత్వం రాదని చెప్పారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీకి భయపడే కేసీఆర్ హైదరాబాద్ విమోచనదినోత్సవం జరపడం లేదన్నారు.కేసీఆర్, కాంగ్రెస్‌లు ఓవైసీ కి భయపడుతున్నారని దెప్పిపోడిశారు. ముస్లింలకు ఇచ్చిన 4శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామన్నారు. మాదిగల సంక్షేమం కోసం ఎస్సీ వర్గీకరణ చేయబోతున్నామని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ పార్టీ బీసీని ముఖ్యమంత్రి చేస్తుందన్నారు. బీజేపీని ఈ ఎన్నికల్లో గెలిపిస్తే సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను మాఫీ చేస్తామని అమిత్ షా ప్రకటించారు.

# రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

వచ్చీరాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

నియోజకవర్గ ప్రజలకు గ్యారెంటీలపై భట్టి సంతకం



**మధిర, నవంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమైందని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి భట్టి విక్రమార్కఅన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అవినీతి కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించబోతున్నారని అన్నారు. కాంగ్రెస గెలిచిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. సోమవారం నాడు కార్తీక పౌర్ణమి రోజున బోనకల్ మండలం, చొప్పకట్లపాలెం ఆంజనేయస్వామి దేవాలయంలో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చిన ఆఫిడవిట్ పైన సంతకం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తాను. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పూర్తిగా అంకితం అవుతాను. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భట్టి విక్రమార్క చెప్పారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతానని చెప్పారు. నిజాయితీగా నా బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. అవినీతికి ఏమాత్రం తావు లేకుండా పారదర్శకంగా పనిచేస్తూ తెలంగాణ ప్రగతి కోసం కృషి చేస్తానని అన్నారు. మధిర నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, పైన పేర్కొన్న విషయాలన్నింటికీ సదా కట్టుబడి ఉంటానని ఆఫిడవిట్‌తో దేవుడి సాక్షిగా భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

# బిజెపి గెలవకుండా రేవంత్ కుట్ర

అయినా కామారెడ్డిలో మాదే గెలుపు

మీడియాతో కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 27 (సమ సమాజం):** కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి వెంకట రమణారెడ్డి గెలుపు అవకాశాలను దెబ్బతీయాలనే కుట్రతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కామారెడ్డికి వచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డి ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకున్నారని, ఇక్కడ బీజేపీ అభ్యర్థి వెంకట రమణారెడ్డి భారీ మెజారిటీతో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గెలవబోతున్నారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీకి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, యువత, పేదలు, బీసీలు, దళితులు, రైతులు బీజేపీవైపు వున్నారని చాలా స్పష్టమవుతోందన్నారు. ఈనెల 30న జరగనున్న పోలింగ్‌లో భారతీయ జనతాపార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని కిషన్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. అవినీతి, కుటుంబ పార్టీలు తెరవెనుక పన్నుతున్న కుట్రలను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకుంటున్నారని కిషన్ రెడ్డి అన్నారు. పదేళ్ళకు ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏం చేసిందో, అలాగే బీఆర్ఎస్ కూడా ఏంచేసిందో వాటిపై చర్చ జరపకుండా.. డబ్బులు, మద్యం పంచడం.. మజ్లిస్ పార్టీతో కలిసి బుజ్జగింపు రాజకీయలు చేస్తున్నారని ఆరోపించారు. సాధ్యంకాని హామీలు ఇవ్వడం లాంటి వాటిపై ఆ పార్టీలు నమ్మకం పెట్టుకున్నాయని విమర్శించారు. వాస్తవ విషయాలపై ఈ రెండు పార్టీలకు విశ్వాసం లేదని కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.

# మన ఓటు ముమ్మాటికీ వజ్రాయుధమే !

భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలన్నా..పటిష్టం కావాలన్నీ ప్రజలు తప్పనిసరిగా ఓటు వేయడం అలవాటు చేసుకోవాలి. అలాగే అవినీతిని ప్రోత్సభించరాదు. మనం అవినీతికి పాల్పడి, డబ్బులకు లొంగితే మన నాయకులు అంతకు వందరెట్లు అవినీతికి పాల్పడుతారని గుర్తించాలి. అవినీతి రహితం అన్నది మన నుంచే మొదుల కావాలి. డబ్బులు తీసుకుని, మందు పుచ్చుకుని, కానుకలు స్వీకరించడం ద్వారా ఓటేసే స్థితికి దూరంగా ఉండాలి. రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రలోభాలకు పాల్పడకుండా ప్రజలే కట్టడి చేయాలి. ఇకపోతే మన ఓటు వల్నే ప్రభుత్వాలు ఏర్పడుతాయని గుర్తించాలి. పథకాల పేరుతో బురిడీలు కొట్టించే వారికి బుద్ధి చెప్పాలి. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే వారికి మాత్రమే పగ్గాలు అందించాలి. అందుకు మనమంతా చైతన్యం కావాలి. కొద్దో గొప్పో డబ్బుకు ఆశపడితే ఐదేళ్ల పాటు మనపై స్వారీ చేస్తారు. పంచిన డబ్బుకు వందింతలు సంపాదించుకునేందుకు అక్రమాలకు పాల్పడతారు. పాలకులను అవినీతికి దూరం చేయాలంటే ధనస్వామ్య రాజకీయా లను దూరం చేయాలి. స్వేచ్ఛగా ముందు ఓటేయడం అలవాటు చేసుకోవాలి. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాల్సి ఉంది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అవినీతికి పాల్పడకుండా ఓటేయడం ద్వారా పెద్దలు ఆశించిన రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి. తెలంగాణలో ఈ నెల30న జరుగుతున్న ఎన్నికల్లో ముఖ్యంగా యువత ఉత్సాహంగా పాల్గొనాలి. ఓటర్లు తమకు సెలవు ఉంది కదా అని ఓటింగ్‌లో పాల్గొనకపోవడం ఓ రకంగా దేశద్రోహంగా పరిగణించాలి. భారత రాజ్యాంగ పీఠికలో పొందుపర్చిన మేరకు భారత్‌లో ప్రజలదే సార్వభౌమాధికారం. అందుకే వజ్రాయుధం కంటే శక్తివంతమైన ఓటు అనే హక్కు కల్పించాం. భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలి. ప్రపంచ దేశాలతో పోలిస్తే గొప్ప రాజ్యాంగం మనది. అధికారానికి మూలం ప్రజలని చాటుతూ సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నాం. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, ఐక్యత, సమగ్రతతో ఉండాలంటూ పేర్కొన్న రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించుకున్నాం. అందుకే ప్రతి సంవత్సరం ఈ రోజున రాజ్యాంగ దినోత్సవం జరుపుకొంటున్నాం. ఇంతటి సమున్నత రాజ్యాంగం సక్రమంగా అమలు కావాలంటే సమర్థమైన, నిస్వార్థమైన పాలకులు రావాలి. అలాంటి వారిని ఎన్నికుని పగ్గాలు అప్పగించే బాధ్యత ప్రజలదే. తమ విలువైన ఓటును వేయడం ద్వారా సమర్థ పాలనకు అవకాశం కల్పించాలి. ఓటు ద్వారా ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు పాలించాలన్నదే మన రాజ్యాంగం లక్ష్యం. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో ఓటేయకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినదిస్తే సరిపోదు.ఎక్కువ విద్యావంతులు, ఉద్యోగులున్నప్పటికీ ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఓటింగ్‌లో మాత్రం ఆసక్తి చూపడం లేదు. తక్కువ సంఖ్యలో ప్రజలు ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ ఎన్నికల్లో కనీసం 90 శాతానికి ఓటింగ్‌ను పెంచి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఓటు హక్కు ద్వారా మనం మీసం మెలేయాలే తప్ప అమ్ముడుపోయి బానిసలు కాకూడదు. నిర్ణయం మన చేతుల్లోనే ఉందన్న సత్యాన్ని విస్మరించరాదు. ఓటును సద్వినియోగం చేసుకోవడం ద్వారా పేద, ధనిక అసమానతలు, మత ప్రాధాన్యం లేని సమాజం కోసం ప్రజలందరూ కృషిచేయాలి. ఇందుకోసం పోటీ పడుతున్న అభ్యర్థుల కులం, మతం కాకుండా వారి నిజాయతీని చూసి ఓటేయాలి. పౌరులందరూ స్వేచ్ఛగా జీవించాలని, సమానత్వంతో మెలగాలని, సోదరభావం పెంపొందించుకోవాలని, ఐక్యతతో కలిసి జీవించాలని రాజ్యాంగంలో పొందు పరిచారు. ఈ భావన అందరిలో ఏర్పడాలంటే.. మంచి నాయకత్వం అవసరం. విద్వేషాలు పెంచేవారిని దూరంగా ఉంచాలి. రాగద్వేషాలకు, పార్టీలకు అతీతంగా ఉండి ప్రజలందరినీ సమానంగా ఆదరించే నాయకత్వాన్ని ఈ ఎన్నికల్లో ఎన్నుకొని రాజ్యాంగం స్ఫూర్తిని చాటడం ద్వారా భారత పౌరులందరం ఒకటేనని చాటాలి. ఇందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలి. ఎన్నికల్లో అందరూ సమానమనే భావనతో ప్రతి ఒక్కరికీ పోటీచేసే అవకాశం రాజ్యాంగం కల్పించింది. ఈ ఎన్నికల్లో యువత ఎక్కువగా పాల్గొనడం సంతోషం. అదే ఉత్సాహంతో ఓటింగ్‌లో పాల్గొని సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలి. కుల, మతాల మధ్య సామరస్యం పాటిస్తూ సమానత్వం తీసుకురావడం, స్త్రీ, పురుషుల మధ్య ఆర్థిక సమానత్వం సాధించడం, ప్రజలందరికీ ఓటు వేసే హక్కు, ఎన్నికల్లో పాల్గొనే హక్కు, గెలుపొందే హక్కు, ప్రభుత్వం ఏర్పాటు చేసే హక్కును రాజ్యాంగం కల్పించింది. ఓటింగ్‌లో పురుషుల కంటే స్త్రీలు ముందుంటున్నారు. ఓటింగ్‌లో ఇదే స్ఫూర్తిని మరింత పటిష్టంగా కొనసాగిం చాలి. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఓటరు కార్డు లేని వారు ఏదైనా ఒక గుర్తింపు కార్డును చూపించవచ్చు. ఇందుకు పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా ప్రజలంతా తమ ఓటును వినియోగించుకునేందుకు ముందుకు రావాలి. ప్రజలే కార్యశూరులు కావాలి. ఓటు వేయడం అన్నది హక్కుగా, బాధ్యతగా స్వీకరించాలి. అవినీతి నేతలను ఓడించడం ద్వారా వారికి బుద్ధి చెప్పాలి. తెలంగాణ లో ఈసారి ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రజలు ముందుకు రావాలి. దేశానికి ఆదర్శంగా నిలవాలి.

# ఎర్రబెల్లిని అక్రమాలను అడ్డుకుందాం

భారీ మెజార్టతో గెలిపించాలి: యశస్విని రెడ్డి పిలుపు



**జనగామ, నవంబర్ 27 (సమ సమాజం):** ఈ ఎన్నికల్లో యువతను ప్రోత్సహించాలని పాలకుర్తి నుంచి పోటీ చేస్తున్నా యశస్విని రెడ్డి పిలుపునిచ్చారు. పాతుకు పోయి ప్రజలను పట్టించుకోని ఎర్రబెల్లిని వదిలించుకోవాలని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యశస్వినిరెడ్డి కోరారు. మంత్రి దయాకర్ రావు పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఆయనకు బై బై చెప్పే టైం ఆసన్నమైందన్నారు. తాను ఎన్నికల బరిలో నిలబడేందుకు ప్రయత్నించగా ఎర్రబెల్లి దయాకర్ రావు అడ్డుకున్నారని ఆరోపించారు. తాము సంపాద కోసం రాలేదని, ప్రజలకు సేవ చేసేందుకే బరిలో నిలిచామని స్పష్టం చేశారు. అభివృద్ధి ముసుగులో రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు పేదల భూములను అక్రమిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరంలో లక్షల కోట్ల అవినీతి జరిగినా విచారణ సంస్థలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ లీడర్లపై సీబీఐ, ఈడీ ఆఫీసర్లను ఉసిగొల్పు తున్నారన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో లక్షల కోట్ల విలువైన వనరులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ధరణిలోని లోపాలతో భూములను కబ్జా చేస్తున్నారన్నారు. ప్రజల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబం మాత్రమే భోగాలు అనుభవిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్ల యువతగా ముందుకు వచ్చిన తనను గెలిపించాలంటూ ఆమె ప్రచారంలో ప్రజలను కోరారు.

# కాంగ్రెస్ రైతు వ్యతరేక విధానం బట్టబయలు



రైతుల నోటికాడ బుక్కను ఎత్తగొట్టారు

ఇది ఎన్నికల పథకం కాదని తెలియదా అంటూ ఆగ్రహం

రైతువ్యతిరేక కాంగ్రెస్‌కు ఓటేయొద్దని పిలుపు

రైతుబంధు నిలిపివేతపై కవిత ఆగ్రహం

**నిజామాబాద్, నవంబర్ 27 (సమ సమాజం):** : కాంగ్రెస్ పార్టీ తన రైతు వ్యతిరేక విధానాన్ని మరోసారి రుజువు చేసుకున్నదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. రైతుల నోటికాడ బుక్కను గుంజుకుందని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు వెంబటబడి రైతు బంధును నిలిపివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఎన్నికల కోసం తెచ్చింది కాదని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. రైతు బంధును కాంగ్రెస్ వెంటపడి ఆపించిందన్నారు. కాంగ్రెస్‌కు అంత అభద్రత ఎందుకని ప్రశ్నించారు. రైతులు బీఆర్ఎస్ వైపు ఉన్నారనే భయంతోనే రైతు బంధుపై కాంగ్రెస్ ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఫిర్యాదు చేసి రైతు బంధును రైతు రుణమాఫీని ఆపిందన్నారు. రైతు వ్యతిరేకతను చాటుకుందన్నారు. నోటి కాడి బుక్కను లాక్కున్నారు కాబట్టి రైతులు ఆలోచించి ఓటు వేయాలని కవిత కోరారు. నిజామాబాద్‌లో పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. రైతుబంధు ఎన్నికల కోసం పెట్టిన పథకం కాదని చెప్పారు. ఇప్పటికే రూ.72 వేల కోట్లు రైతుబంధు రూపంలో రైతుల ఖాతాల్లో వేశామన్నారు. రైతులంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారన్న అభద్రతలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని విమర్శించారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ మరోసారి రైతులను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించిందన్నారు. అన్నదాతలంతా ఓటు ద్వారా ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. రైతుబంధు కావాలా.. రాబందులు కావాలా అని ప్రశ్నించారు. మతం పేరుతో ఒక పార్టీ, కులం పేరుతో మరోపార్టీ నడుస్తున్నదని విమర్శించారు. గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక ముసాయిదా తయారు చేస్తామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో నిరుపేదలకు వరమని చెప్పారు. బీఆర్ఎస్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలన్నారు. విభజన హామీలపై కాంగ్రెస్ నాయకులు ఏనాడూ మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణపై కేంద్ర విషం చిమ్ముతున్నదని చెప్పారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా కేంద్రం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ వెయ్యి బుల్డోజర్లు పంపినా కారుతో సమాధానం చెబుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు తెలంగాణపై మిడతల దండులా తెలంగాణపై పడ్డారన్నారు. మది ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించా మని చెప్పారు. ఉపాధి హామీ కూలీల ప్రయోజనాలపై కాంగ్రెస్ ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. పేదలు, మధ్యతరగతి వర్గాలపై కాంగ్రెస్ పార్టీకి ప్రమలేదన్నారు. సింగరేణిని ప్రైవేటుకు అప్పగించిందే హస్తంపార్టీ అన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ప్రియాంకా గాంధీ చదువుతున్నారని ఎద్దేవాచేశారు. రాహుల్ గాంధీ జోడో యాత్రలో తెలంగాణ ప్రస్తావన లేదన్నారు. బీజేపీని కాంగ్రెస్ నేతలు ఎందుకు ప్రశ్నించరని నిలదీశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ రెండు పార్టీల నేతలంతా ఎక్కడున్నారని నిలదీశారు. బీజేపీ హయాంలో బాగుపడ్డది కేవలం కార్పొరేట్లు మాత్రమేనని విమర్శించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. తమ శతృత్వమంతా బీజేపీతోనేనని అన్నారు. కాంగ్రెస్ గుండాల ప్రభుత్వాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందని కవిత విమర్శించారు. సింగరేణి ప్రైవేటీకరణ అని అంటున్న ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. సింగరేణిని ప్రైవేట్‌కు అప్పగించింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంలో పెద్ద పెద్ద వాళ్ళే బాగుపడ్డారన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాల్లో ఇంతవరకూ కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. యువత అడగాలన్నారు. మతం పేరుతో మంట పెట్టాలి అని ఒక పార్టీ చూస్తుంటే.. కులం పేరుతో చిచ్చు పెట్టాలని మరో పార్టీ చూస్తోందని కవిత విమర్శించారు. మంచోల్లు కావాలా ముంచే వాళు కావాలా ఇరిగేషన్ కావాలా మైగ్రేషన్ కావాలా 24 గంటల కరెంటు కావాలా 3 గంటల కరెంట్ కావాలా? అని కవిత ప్రశ్నించారు.

# హరీష్ రావు వ్యాఖ్యల వల్లే రైతుబంధు నిలిపివేత

కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ ట్వీట్



**న్యూఢిల్లీ, నవంబర్ 27 (సమ సమాజం):** బీఆర్ఎస్, మంత్రి హరీష్‌రావు బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్లే రైతుబంధు ఆగిందని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యలు చేశారు. రైతుబంధు నిలిచిపోవడంతో కేసీ వేణుగోపాల్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. రైతుబంధు రైతుల హక్కన్నారు. హరీష్ రావు భాధ్యతారహిత ప్రకటన ఎందుకు చేయవలసి వచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ ఆదేశాలనే హరీష్‌రావు అమలు చేస్తున్నారని ఆరోపించారు. వారిద్దరి సంకుచిత భావం వల్ల.. రైతు బంధు నిలిచిందన్నారు. ఈ పాపానికి బీఆర్ఎస్ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తూ కేసీ వేణుగోపాల్ ట్వీట్ చేశారు.

# స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం

త్వరగా పూర్తి చేసి ..రిపబ్లిక్ డేకు సిద్ధం చేయాలి ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం జగన్ ఆదేశం



**విజయవాడ, నవంబర్ 27 (సమ సమాజం):** విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేద్కర్ స్మృతివనం, అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులపై క్యాంపు కార్యాలయంలో సీఎం వైయస్.జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ అంబేద్కర్ స్మృతివనం నిర్మాణం చారిత్రాత్మకమైనదన్నారు. ఇది అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా అభివర్ణించారు. సామాజిక న్యాయస్ఫూర్తికి ప్రతిబింబంగా నిలిచే ప్రాజెక్టు ఇదన్నారు. రాజ్యాంగ ఔన్నత్యం, ప్రజాస్వామ్య విలువలకు ప్రేరణగా నిలిచే గొప్ప కట్టడం ఇదన్నారు. ప్రజల మధ్య ఐక్యత, సుహృద్భావ వాతావరణాన్ని, సామరస్యాన్ని పెంపొందించడంలో ఈ ప్రాజెక్టు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. :నిర్దేశించుకున్న గడువులోగా అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం పనులను పూర్తి చేయాలన్నారు. స్మృతివనం, విగ్రహం ప్రారంభించేనాటికి ఒక్క పని కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. వచ్చే రిపబ్లిక్‌డే నాటికి పూర్తయ్యే విధంగా... పనులు చేపడుతున్నామని సీఎంకు అధికారులు తెలిపారు. జనవరి 15 నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. జనవరి 24న ప్రారంభోత్సవానికి అంబేద్కర్ విగ్రహం, స్మృతివనాన్ని సిద్ధం చేస్తామని అధికారులు అన్నారు. కన్వెన్షన్ సెంటర్ పనులు కూడా పూర్తి కావాలన్న సీఎం,.కన్వెన్షన్ సెంటర్‌లో మౌలిక సదుపాయాలను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశ ఇచ్చారు. స్మృతివనం ప్రాంగణమంతా పచ్చదనం ఉట్టిపడేలా మంచి ఉద్యానవనాన్ని తీర్చిదిద్దాలని జగన్ ఆదేశించారు. నడక దారి పొడవునా గ్రీనరీ ఉండేలా చూడాలని ఆదేశం ఇచ్చారు. .పనులు నిర్ధేశించుకున్న గడువులోగా కచ్చితంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు నిరంతరం పనుల పర్యవేక్షణ జరగాలన్నారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనుల పురోగతిని సీఎంకు అధికారులు వివరించారు. .స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ కాన్సెప్ట్‌గా అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేస్తున్నారు. . అంబేద్కర్ విగ్రహం పీఠం ఎత్తు 81 అడుగులు. విగ్రహం ఎత్తు 125 అడుగులు.కృష్ణలంక ప్రాంతంలో నిర్మించిన రక్షణ గోడ పొడవునా 1.2 కిలోమీటర్ల సుందీకరణ పనులపై పలు ప్రతిపాదనలను సీఎంకు వివరించిన అధికారులు.పార్క్, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్టు సీఎంకు అధికారులు వివరించారు. పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, *Editor: GOSUKONDA PRUDHVIRAJU*,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in